జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శుక్రవారం | 18-7-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 399 పేజీలు: 4 వెల : రూ.7

# నరసన్నపేట బంగారం గుట్టురట్టు!



*** హాల్‌మార్క్ లేని బంగారు ఆభరణాలు విక్రయిస్తున్న కొందరు వ్యాపారులు**
*** నరసన్నపేట బంగారు షాపుల్లో బీఐఎస్ అధికారుల తనిఖీ * 1.72 కిలోల బంగారు ఆభరణాలు, యంత్రాలు సీజ్**
*** అధికారుల తనిఖీలతో మూతపడిన షాపులు**

**శ్రీకాకుళం క్రైం, జూలై 17 (వార్త):** నరసన్నపేటలో కొందరు బంగారు వ్యాపారులు కొనుగోలుదారులకు మోసం చేస్తూ లాభాలు అర్జిస్తున్నారు. హాల్‌మార్క్ లేని బంగారాన్ని సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అమ్మేస్తూ మోసం చేస్తున్నారు. నరసన్నపేటలో బంగారు ఆభరణాలు అతిచవక అని జిల్లాలోని చాలామంది పసిడి కొనుగోలుదారులు ఇక్కడి వస్తుంటారు. తాజాగా బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్(బీఐఎస్) అధికారుల బృందం నరసన్నపేటలోని బంగారం షాపుల్లో గురువారం చేసిన తనిఖీల్లో ఈ చవక బండారం బయటపడింది.

హాల్‌మార్క్ లేని బంగారం చవకగా అమ్మేస్తూ ఇక్కడి వ్యాపారులు కొందరు కాసులు చేసుకుంటున్నారు. నిత్యం నరసన్నపేట కేంద్రంలో రూ.కోట్లల్లో వ్యాపార లావాదేవీలు జరుగుతుంటాయి. వ్యాపారుల బంగారం గుట్టురట్టు కావడంతో పసిడి కొనుగోలుదారులు ఒక్కసారిగా అవాక్కయ్యారు. వివరాల్లోకి వెళితే.. నరసన్నపేటలోని మారుతీనగర్ కూడలి వద్ద జీఎన్ఆర్ గోల్డ్, డైమండ్స్ దుకాణంపై బీఐఎస్ విజయవాడ జోన్ జేడీ టి.అర్జున్ ఆధ్వర్యంలో గురువారం దాడులు జరిగాయి. హాల్‌మార్క్ లేకుండా ఆభరణాలు విక్రయించడంపై వచ్చిన ఫిర్యాదుల మేరకు వారు సోదాలు చేశారు. ఈ దాడుల్లో 1.72 కిలోల బంగారు ఆభరణాలు సీజ్ చేశారు. నకిలీ హాల్‌మార్క్ ఎక్కడ ముద్రిస్తున్నారన్నదానిపై అధికారుల బృందం విచారణ చేపట్టింది. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలోని పైఅంతస్తుపై నిర్వహిస్తున్న లక్ష్మీ హాస్య హాల్‌మార్క్ కేంద్రంపై కూడా బీఐఎస్ అధికారులు తనిఖీలు చేశారు. ఎలాంటి అనుమతులు లేని కేంద్రంగా గుర్తించారు. కేంద్రంలోని కంప్యూటర్లు, యంత్రాలను జప్తు చేశారు. ఈ సోదాల్లో బీఐఎస్ డీడీ వివేక్ వర్ధన్ రెడ్డి, తదితర అధికారులతో పాటు పోలీసులు పాల్గొన్నారు. కాగా, శ్రీకాకుళం జిల్లావ్యాప్తంగా ఉన్న బంగారు దుకాణాలపై బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్(బీఐఎస్) అధికారులు దాడులు చేస్తే పెద్ద ఎత్తున హాల్‌మార్క్ లేని బంగారు ఆభరణాల గుట్టురట్టయ్యే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కాగా, నరసన్నపేటలో బంగారం షాపులపై బీఐఎస్ అధికారులు దాడులు చేస్తున్నారన్న విషయం తెలుసుకోగా, మిగతా షాపులు వారు అప్రమత్తమయ్యారు. వెనువెంటనే షాపులు మూసివేశారు.





## మార్కెట్ కమిటీ చైర్మన్ల నియామకం

**శ్రీకాకుళం, జూలై 17 (వార్త):** వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీకాకుళం జిల్లాలో నాలుగు మార్కెట్ కమిటీల చైర్మన్లను నియమించింది. ఇద్దరు టీడీపీ, ఇద్దరు జనసేన నేతలకు ఈ పదవులు వరించాయి. పాతపట్నం నియోజకవర్గంలో హిరమండలం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మామిడి రామకృష్ణ (జనసేన), పాతపట్నం చైర్‌పర్సన్‌గా గౌరమ్మ చిన్నింటి, ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని కంచిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా మద్దిలి విజయలక్ష్మి (టీడీపీ), శ్రీకాకుళం నియోజకవర్గంలోని శ్రీకాకుళం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా దారపు జ్యోత్స్న(జనసేన)ను నియమించారు. ఎన్నికైన వారిని ఆయా పార్టీల జిల్లా నేతలు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.



## ఇళ్లివ్వకుంటే.. డబ్బులు ఇచ్చేయండి

*** ధర్నా చేసిన కుందువానిపేట గ్రామస్థులు**

**శ్రీకాకుళం, జూలై 17 (వార్త):** అర్హులందరికీ హుద్‌హుద్ ఇళ్లు ఇవ్వాలని, లేదంటే తాము కట్టిన డబ్బులు ఇవ్వాలని కుందువానిపేట గ్రామస్తులు గురువారం ధర్నా చేశారు. ఈసందర్భంగా సర్పంచ్ సూరాడ సూర్యం మాట్లాడుతూ 2014-19 టీడీపీ ప్రభుత్వం ఉన్న సమయంలో సుమారు 400 మంది వద్ద నుంచి రూ.12 వేలు చొప్పున వసూలు చేశారన్నారు. కుందువానిపేటలో 288 హుద్‌హుద్ ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. వైసీపీ హయాంలో తొలివిడతలో 145 ఇళ్లు ఇవ్వగా, రెండో విడతలో 72 ఇళ్లను అర్హులను గుర్తించి అందించారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక టీడీపీ నాయకుడు సూరాడ అప్పన్న కేవలం తన కుటుంబ సభ్యులకు మాత్రమే 65 ఇళ్లు కేటాయించుకున్నారని, మిగిలిన వారికి అన్యాయం చేశారని చెప్పారు. దీనికితోడు కొంతమందిని హౌసింగ్ అధికారులతో ఖాళీ చేయించాలని చూస్తున్నారన్నారు. ఇంకా చాలామందికి ఇళ్లు ఇవ్వలేదని, ఒకవేళ ఇళ్లు ఇవ్వకుంటే తాము కట్టిన డబ్బులు ఇచ్చేయాలని సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

## 22.5కేజీల గంజాయి స్వాధీనం

*** ఇద్దరిని అరెస్టు చేశాం * సోంపేట ఎక్సైజ్ సీఐ జీవీ రమణ**

మందస, జులై 17(వార్త): గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులు అరెస్ట్ చేసినట్టు సోంపేట ఎక్సైజ్ సీఐ జీవీ రమణ చెప్పారు. ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్(శ్రీకాకుళం) ఆదేశాల మేరకు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మురళీధర్ ఆధ్వర్యంలో సోంపేట ఎక్సైజ్ సీఐ మొబైల్ టీంతో సంయుక్తంగా ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్ చుట్టుపక్కల తనిఖీలు నిర్వహిస్తుండగా ఒక మహిళ, మరో వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించగా వారికి సంబంధించిన లగేజ్ ల ను సోదా చేయగా వారిద్దరి నుంచి 22.566 కేజీల గంజాయి లభించిందన్నారు. వారిద్దరూ ఒడిషా రాష్ట్రంలోని మోహన బ్లాక్ కి చెందిన తులుషా నాయక్, సామ్సన్ బీరోగా గుర్తించి కేసు నమోదు చేశామన్నారు. గంజాయి, మొబైల్ ఫోన్లను సీజ్ చేసి ఇరువురిని అరెస్ట్ చేశామని, ఒడిషా రాష్ట్రం జితున్ అనే వ్యక్తి వీరిద్దరి ద్వారా ఒడిషా నుంచి ముంబయికి ట్రైన్ ద్వారా గంజాయి చేర్చుటకి బాడుగకి మాట్లాడుకున్నట్లు విచారణలో తెలిసిందన్నారు. పట్టుబడిన గంజాయి విలువ లక్ష రూపాయలు వరకు ఉంటుందని, ముగ్గురి మీద కేసు నమోదు చేశామన్నారు. పట్టుబడిన ఇద్దరిని కోర్టులో హాజరుపరిచామని తెలిపారు. దాడులలో సోంపేట ఎక్సైజ్ సీఐ జి.వి.రమణ, ఎస్.ఐ.సుజాత, సిబ్బంది శ్రీనివాస్, విజయ్, ఆనంద్ పాల్గొన్నారు.



## బూత్ లెవెల్ ఆఫీసర్లు, ఎన్నికల సూపర్‌వైజర్లకు శిక్షణ

**శ్రీకాకుళం, జులై 17(వార్త):** భారత ఎన్నికల సంఘం- ఇండియా ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్మెంట్ ఆదేశాల మేరకు గురువారం శ్రీకాకుళం నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రం 251 నుంచి 279 వరకు బూత్ లెవెల్ ఆఫీసర్లకు, ఎన్నికల సూపర్ వైజర్లకు ఎన్నికల జాబితా నిర్వహణ ( ఎలక్టోరల్ మేనేజ్మెంట్) శిక్షణ రెవెన్యూ గెస్ట్ హౌస్‌లో నిర్వహించారు. ఓటర్ల జాబితా, క్లెయిమ్స్, బీఎల్ఓ అప్లికేషన్, ఈసీఐ వెబ్‌సైట్‌పై అవగాహన కల్పించారు. ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించారు. ఇంటింటి సర్వే విధానాన్ని వివరించారు. సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఎన్నికల ఆపరేటర్లకు జ్ఞాపికలు అందించారు. ఈ శిక్షణలో జీకే శ్రీనివాసరావు, రాజశేఖర్, బూత్ లెవెల్ అధికారులు, ఎన్నికల సూపర్ వైజర్లు పాల్గొన్నారు.



# జిల్లాలో రేపు ప్లాస్టిక్ రహిత కార్యక్రమాలు

**-పాఠశాలల్లో అవగాహన,**

**- గ్రామాల్లో ప్రత్యేక డ్రైవ్‌లు**



**శ్రీకాకుళం, జులై 17(వార్త):** 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'లో భాగంగా జులై 19న జిల్లావ్యాప్తంగా ప్లాస్టిక్ కాలుష్య నిర్మూలనపై భారీ కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామం, వార్డు, మండల స్థాయిలో ప్రజల భాగస్వామ్యంతో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ ఈ సూచనలు చేశారు. సచివాలయం నుంచి ప్రధాన కార్యదర్శితో జరిగిన ఈ సమీక్షలో 'స్వర్ణాంధ్ర పీ-4 ఫౌండేషన్', 'సానుకూల ప్రజా దృక్పథం', 'ఎంఎస్ఎంఈ పార్కులు', 'ప్రధానమంత్రి ఆదర్శ్ గ్రామ యోజన' వంటి అంశాలపై చర్చ జరిగింది. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు తమ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించా లని కలెక్టర్ ఆదేశించారు. స్వయం సహాయక సంఘాల సమావేశాల్లో మహిళలకు ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయాలపై ప్రాక్టికల్ అవగాహన ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో, ముఖ్యంగా ప్లాస్టిక్ బాటిళ్ల వాడకాన్ని తగ్గించే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పేద కుటుంబాల దత్తత కార్యక్రమాన్ని వేగవంతం చేయడానికి మార్గదర్శులను (మెంటార్లను) వెంటనే గుర్తించి రిజిస్టర్ చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లా స్థాయి యంత్రాంగం తుది అర్హుల జాబితా ఆధారంగా మార్గదర్శులను సంప్రదించేందుకు సిద్ధమవుతోందని తెలిపారు. పారిశ్రామికవేత్తలు, ఎన్ఆర్ఐలను సంప్రదించి "బంగారు కుటుంబాల"కు విద్య, వైద్యం, మౌలిక వసతుల సహకారం అందేలా చర్యలు తీసుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి వెంక టేశ్వరరావు, పలు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## మదర్, గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ ఔదార్యం

**మందస, జులై 17(వార్త):** మదర్ చారిటబుల్ ట్రస్ట్(సొండిపూడి), గురుదేవ చారిటబుల్ ట్రస్ట్(విజయనగరం) ఔదర్యం చాటుకున్నాయి. మందస మండలంలోని సొండిపూడి గ్రామానికి చెందిన వృద్ధ దివ్యాంగురాలకు చక్రాల కుర్చీ అందజేశారు. అదేవిధంగా మందస పట్టణానికి చెందిన దివ్యాంగులకు చంక కర్రలను గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ వారి సహకారంతో సొండిపూడి గ్రామానికి చెందిన మదర్ చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో అందజేశారు. కార్యక్రమంలో చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు మల్లారెడ్డి భాస్కరరావు, కర్రి దుర్యోధన, సత్యసాయి భక్తులు వడ్డే అప్పారావు, వివేకనంద విద్యానికేతన్ పాఠశాల హెచ్ఎం పైల కోటేశ్వరరావు అత్యధిక దివ్యాంగులకు సహకారం అందిస్తున్నందుకు పలువురు దివ్యాంగులు ట్రస్ట్‌కు అభినందనలు తెలిపారు.

## విశ్రాంత ఉపాధ్యాయుడు కృష్ణారావు ఉదారత



**మందస, జులై 17(వార్త):** విశ్రాంత ఉపాధ్యాయుడు బయ్య కృష్ణారావు ఉదారత చూపారు. అండమాన్ కు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు బయ్య కృష్ణారావు తన తల్లిదండ్రులు బొడ్డేశు, సావిత్రమ్మల జ్ఞాపకార్థంగా రూ.15వేలు విలువ చేసే ఎప్సన్ ప్రింటర్ ను పల్లిసారథి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బహూకరించారు. పాఠశాల విద్యార్థుల అంతర్గత పరీక్షల నిర్వహణ, ఇతర అవసరాలకు ఇబ్బంది కలగకుండా ఉండడానికి బహుకరించినట్లు చెప్పారు. ప్రధానోపాధ్యాయుడు వై.కాంతారావు మాట్లాడుతూ పాఠశాల విద్యాభివృద్ధికి సర్పంచ్ బత్తిని కుసుమహేమంత్ రావు, స్కూల్ మేనేజ్మెంట్ చైర్ పర్సన్ దున్న కవితరమేష్ చొరవ తీసుకుని గ్రామ పెద్దల సహకారంతో పాఠశాల అభివృద్ధికి దోహదపడుతున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుంట కోదండరావు, కె.మాధవరావు, ఎం.హరనాథ్, ఎన్.విష్ణుమూర్తి, ఎస్.పాపారావు, బి.అన్నపూర్ణ, ఉపాధ్యాయేతర సిబ్బంది సీతమ్మ, నాగభూషణ్ రావు, శివాజీలు పాల్గొన్నారు.

## వైభవంగా పీఏసీఎస్ చైర్మన్ల ప్రమాణస్వీకారం

**-మందస, బాలిగాంలలో**

**పండగ వాతావరణం**

**-భాస్కరరావు, రుద్రయ్య బాధ్యతల స్వీకరణ**






**మందస, జులై 17(వార్త):** మందస, బాలిగాంలలో పండగ వాతావరణం నెలకొంది. బాలిగాం, మందస ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు చైర్మన్లుగా లబ్బ రుద్రయ్య, తమిరి భాస్కరరావులు నియమితులయ్యారు. వీరి ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా జరిగింది. పలాస ఎంఎల్ఏ గౌతు శిరీషా, మాజీ ఎంఎల్ఏ గౌతు శ్యామసుందర శివాజీల సమక్షంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తల హర్షధ్వనాల మధ్య భాస్కరరావు, రుద్రయ్య ప్రమాణ స్వీకారం చేయగా, ఎంఎల్ఏ శిరీషా చేతుల మీదుగా భాస్కరరావు, మాజీమంత్రి శివాజీ చేతుల మీదుగా రుద్రయ్య నియామకపు ఉత్తర్వులు అందుకున్నారు. బాలిగాం పీఏసీఎస్ డైరక్టర్లుగా గున్న రామారావు, సప్ప సంజీవరావు, మందస డైరక్టర్లుగా పిన్నింటి వాసు, కర్రక హరికృష్ణలు కూడా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా శిరీషా, శివాజీలకు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## 72మంది కవుల 130కవితల సమ్మిళితమే 'ముంజూరు'




**మందస, జులై 17(వార్త):** శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు పేర్లతో ఆరు జిల్లాల ప్రాంతంగా విలసిల్లుతున్న కళింగాంధ్ర ప్రాంతంలో కవులందరినీ ఒకచోటకు చేర్చి ఒక డైరెక్టరీని తీసుకువద్దామని మొదలుపెట్టిన ప్రయత్నం ఒక గ్రంథంగా రూపుదిద్దుకుంది. కళింగాంధ్ర కవితా వార్షికకు మన భాష గుబాళింపు అద్దేందుకు 'ముంజూరు'గా నామకరణం చేశారు. ఇందులో 72మంది కవులు రాసిన 130 కవితలున్నాయి. అనుబంధంగా ఉన్న డైరెక్టరీలో 260మందికి పైగా కళింగాంధ్ర కవుల వివరాలను పొందుపరిచారు. ఈ ప్రచురణ ఈ ప్రాంత అస్తిత్వ ఉద్యమానికి కీలకం కాగలదని ప్రచురణకర్తలు పేర్కొన్నారు. మందస మండలం హరిపురం గ్రామంలో ఈ నెల 18(శుక్రవారం)న ముంజూరు కవితా సంకలనం ఆవిష్కరించనున్నారు. ఉద్దానం ప్రాంతంలో కృషిచేస్తున్న సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పుస్తక ఆవిష్కరణలో ప్రముఖ చరిత్రకారులు నల్లి ధర్మారావు ముఖ్య వక్తగా హాజరుకానున్నారు. కింతలి కృష్ణమూర్తి, డాక్టర్ కణితి కేశవరావు, దాసరి తాతారావు,డాక్టర్ కుమార్ నాయక్, మజ్జి భాస్కరరావు, లబ్బ రుద్రయ్య, వినోద్ కుత్తుం, రాపాక ధనరాజు తదితరులు పాల్గొంటారని సిక్కోలు బుక్స్ వ్యవస్థాపకులు దుప్పల రవికుమార్ తెలిపారు.

# లింగ నిర్ధారణ నేరం : ఆర్డీవో



**శ్రీకాకుళం, జులై 17(వార్త):** లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని, ఈ నిబంధనలను అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని శ్రీకాకుళం ఆర్డీవో సాయిప్రత్యూష తెలిపారు. గురువారం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన సబ్-డిస్ట్రిక్ట్ లెవెల్ అప్రోప్రియేట్ అథారిటీ, కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ...ప్రసూతి ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లు లింగ నిర్ధారణ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన శిక్ష తప్పదని హెచ్చరించారు. శ్రీకాకుళం సబ్ డివిజన్ పరిధిలో లింగ నిర్ధారణ నేరం పై హోర్డింగులు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే గ్రామస్థాయిలో ప్రజల్లో అవగాహన కల్పించే సదస్సులు నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో గైనకాలజిస్ట్ పైడి స్వర్ణలత, డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. మేరీ కాథరిన్, డిప్యూటీ మాస్ మీడియా అధికారి మహంతి వెంకటేశ్వరరావు, సీపీ రమణమూర్తి, అడ్వకేట్ విజయలక్ష్మి, సోషల్ వర్కర్ లిడియా, మంతెన వెంకటస్వామి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ విజయలక్ష్మి, పి.మోహిని తదితరులు పాల్గొన్నారు.

## ధర్మారావు కుటుంబానికి నీలకంఠం పరామర్శ

**మందస, జులై 17(వార్త):** బేతాళపురం గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు, సూరాడ నారాయణ కుమారుడు సూరాడ ధర్మారావు మరణించారు. దీంతో ఆ కుటుంబాన్ని అగ్నికుల క్షత్రియ జిల్లా నాయకుడు జుత్తు నీలకంఠం పరామర్శించారు. 52ఏళ్ల ధర్మారావు దీర్ఘకాలిక వ్యాధితో మరణించారని ఆయన మరణంతో కుటుంబానికి తీరనిలోటని అన్నారు. ధర్మారావు పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనతో పాటు గ్రామపెద్దలు, కుటుంబ సభ్యులు సూరాడ నాగేశ్వరావు, మిత్రబృందం, ఆయన సోదరుడు, ఎంపీటీసీ సూరాడ వాసు ఉన్నారు.




# అన్ని వర్గాలను మోసం చేసిన కూటమి

**-దగా పాలనను ప్రజలు ఎండగట్టాలి**

**-సూపర్ సిక్స్ హామీలు ఎక్కడ...?**

**-పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి**

**-ఆమదాలవలస ఇన్‌చార్జి చింతాడ రవికుమార్**

**సరుబుజ్జిలి, జులై 17(వార్త):** కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక చర్యలకు పాల్పడుతోందని, ప్రజలకు వంచన చేస్తూ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి దించిందని ఆమదాలవలస ఇన్చార్జి డాక్టర్ చింతాడ రవికుమార్ విమర్శించారు. సరుబుజ్జిలి మండలో గురువారం జరిగిన మండల స్థాయి వైసిపి విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా హామీలను కూటమి ప్రభుత్వం గాలిలో కలిపిందని, ముఖ్యమంత్రి చంద్ర బాబు హామీలతో అన్ని వర్గాల ప్రజలను ఉద్యోగులను కార్మికులను రైతులను నిరుద్యోగులను మోసం చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వ పాలనలో అవినీతి తాండవిస్తుందని, భూకబ్జాలు పెరిగిపోయాయని ప్రభుత్వ నిరంకుశ పాలనను వ్యతిరేకిస్తున్న వారిని తప్పుడు కేసులను బనయిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడికక్కడ భూ కబ్జాలు దోపిడీ దౌర్జన్యాలు పెరిగిపోయాయని ప్రజలకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజల హక్కులను హరిస్తూ నిరంకుశంగా పాలన సాగించి అణచివేత చర్యలను కొనసాగిస్తుందని అన్నారు. కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధులను నిలదీయాలని ఆయన పిలుపునిచ్చారు. వైసిపి కార్యకర్తలు అభిమానులు గ్రామాల్లో వైసిపి పార్టీ పటిష్టత కోసం కృషి చేయాలని ప్రజా సమస్యలపై నిరంతరం పనిచేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మండల వైసిపి అధ్యక్షులు బెవర మల్లేశ్వరరావు , జెడ్పీటీసీ సభ్యులు నాగేశ్వరరావు, రావాడ రవి బద్రి రామారావు అప్పలనాయుడు తదితర ముఖ్య నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## అందరి సహకారంతోనే వంశధార జలాల సాధన

**మందస, జులై 17(వార్త):** ప్రజలు, రైతులు సహకారంతోనే వంశధార జలాలు సాధించగలమని వంశధార సాగునీరు సాధన కమిటీ నాయకులు అన్నారు. మందస మండలంలోని నర్సింగపురం పంచాయతీ మహదేవపురం గ్రామంలో వంశధార సాగునీరు సాధన కమిటీ సమావేశం రైతులతో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మరో ఉద్యమానికి సిద్దం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మార్పు మన్మధరావు, ఉపాధ్యక్షుడు ధర్మార్పు వెంకటరావు, నల్ల హడ్డి, దుంపల వైకుంఠరావు, మజ్జి రమణ, కొవ్వూరు దశరధి, రైతులు పాల్గొన్నారు.




# పార్కింగ్..మా ఇష్టం..!

**-సరుబుజ్జిలి పశు వైద్యశాల ఎదుట**

**ఇష్టానుసారంగా వాహనాల నిలిపివేత**

**-లోపలికి వెళ్లేదారి లేక ప్రజలు, ఉద్యోగుల పాట్లు**

**సరుబుజ్జిలి, జులై 17(వార్త):** సరుబుజ్జిలి మండలం కేంద్రంలో లో ఉన్న మండల పశు వైద్యశాల ముందు వాహన పార్కింగ్‌కు అడ్డాగా షాపు లు ఉండవల్ల హాస్పిటల్ ఎక్కడ ఉంది తెలియదు ప్రధాన ద్వారం ఎదుట నో పార్కింగ్ బోర్డులు, బ్యానర్లు ఉన్నా వాహనదారులు ఇష్టారాజ్యంగా వెహికిల్స్ పార్క్ చేస్తుండగా, లోపలికి వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతున్నది. వాహనాలు నిలిపేందుకు పక్కనే ఉన్న చెట్ల కింద ఖాళీ స్థలం చదును చేసినా, ప్రధాన ద్వారం ఎదుట పార్క్ చేస్తుండడంతో ప్రభుత్వ విభాగాలకు వచ్చే ప్రజలు, ఉద్యోగులు నానా అవస్థలు పడుతున్నారు. వాహనాలు నిలుపకుండా చూడాలని కోరుతున్నారు ప్రభుత్వం ఉద్యోగులు కోరుతున్నారు.



# హామీల అమలులో బాబు విఫలం

## -మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



**కొత్తూరు, జులై 17 (వార్త) :**'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ' కార్యక్రమం కొత్తూరులోని బోర శ్రీరామమూర్తి కళ్యాణమండపంలో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైఎస్ఆర్సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అధ్యక్షత వహించారు. సభలో ప్రసంగించిన ఆమె, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు 2024 ఎన్నికల సమయంలో అధికారాన్ని పొందేందుకు ప్రజలకు అవాస్తవ హామీలు ఇచ్చారని, ఆ హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. "బాబు ఇచ్చిన హామీలు 'ష్యూరిటీ'గా చెప్పినా, ఫలితంగా ప్రజలకు 'మోసం' మాత్రమే మిగిలింది," అని ధ్వజమెత్తారు.

వైఎస్ఆర్సీపీ పాలనలో పేదలకు మంచి రోజులు:

జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి పేదలు, బలహీన వర్గాలు, మహిళలు, విద్యార్థులు, రైతులు వంటి అన్ని వర్గాలకూ అనేక సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనం చేకూరిందని ఆమె వివరించారు. అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన, రైతు భరోసా, వసతి దీవెన వంటి పథకాలతో రాష్ట్రంలో సంక్షేమ విప్లవం చోటుచేసుకుందని పేర్కొన్నారు. "ప్రజలకు మద్దతుగా నిలిచి, వారి నమ్మకాన్ని పొందిన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రజలు మరోసారి గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారు," అని ధైర్యంగా తెలిపారు.

# భూసేకరణను వ్యతిరేకించండి

**పలాస, జులై 17 (వార్త):** పలాసఏరో స్పేస్ పార్కు భూసేకరణకు వ్యతిరేకంగా పోరాడి విజయం సాధించిన కర్ణాటక రైతాంగ పోరాట స్ఫూర్తితో కార్గో ఎయిర్పోర్ట్ బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా పోరాడాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కే. మోహన్ రావు, జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల .అజయ్ కుమార్, రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు కే బాలాజీ రావు, తమ్మినాన .భాస్కరరావు సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం గణపతి పిలుపునిచ్చారు. గురువారం పలాస సిఐటియు కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కర్ణాటక లో ఏరో స్పేస్ పార్క్ భూసేకరణకు వ్యతిరేకంగా 1198 రోజులు పోరాడి భూ సేకరణ నిర్ణయాన్ని త్రి ప్పి కొట్టిన రైతాంగానికి అభినందనలు తెలిపారు. రైతులు సాగించిన తీవ్ర నిరసనలు, ఐక్య పోరాటాల ఫలితంగా అక్కడ ప్రభుత్వం భూసేకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నదని వారన్నారు. దేశవ్యాప్తంగా బలవంతపు సేకరణకు వ్యతిరేకంగా పోరాడే రైతాంగ ఉద్యమాలకు ఈ విజయం చాలా ఉత్సాహం ఇస్తుందని, ఈ చారిత్రక పోరాటం స్ఫూర్తితో రైతులు బలవంతపు భూసేకరణకు, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఉద్దానం తీర ప్రాంతంలో మన రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ ఫీల్డ్ కార్గో ఎయిర్పోర్ట్ పేరుతో బలవంతపు భూసేకరణకు పూను కొంటుందని చట్ట వ్యతిరేకంగా రైతుల అభిప్రాయం తెలుసుకోకుండా వారి భూములను సర్వే చేయడా న్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని వారన్నారు. పచ్చని ఉద్దానం విధ్వంసానికి రాష్ట్ర ప్రభుత్వం పూనుకుంటుందని ప్రజల ప్రయోజనాలకి భిన్నంగా ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలు విచారకరమని




వారన్నారు. ఎవరు ఎన్ని ఆందోళనలు, ధర్నాలు చేసిన ఎయిర్పోర్ట్ నిర్మాణం ఆగదని స్థానిక ఎమ్మెల్యే ప్రకటన రైతులని రెచ్చగొట్టే విధంగా ఉన్నదని, రైతుల వ్యతిరేకతని, వారి అభిప్రాయాలని పరిగణలోకి తీసుకోవడం శ్రేయస్కరమని వారన్నారు. ఉద్దాన తీర ప్రాంతంలో పచ్చని జీడి, కొబ్బరి ,పనస ,మునగ మొదలగు చెట్లు వారి జీవనోపాధికే కాకుండా పర్యావరణానికి ఎంతో మేలు చేస్తాయని, అలాంటి భూములు కార్గో ఎయిర్పోర్ట్ కోసం సేకరించి అదే అభివృద్ధి అని చెప్పడం ఎంతవరకు సబవని వారన్నారు. ఉద్దానం ప్రాంతంలో కార్గో ఎయిర్పోర్ట్ పేరుతో సుమారు 1400 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించి కార్పొరేట్ కంపెనీలకు అప్పచెప్పుతుందని, ఆక్కడ ఏర్పాటు నిర్మిస్తే ఏ విధమైన అభివృద్ధి జరుగుతుందో ప్రభుత్వం చెప్పాలని వారన్నారు. అభివృద్ధి అంటే రైతుల భూములు బలవంతంగా లాక్కొని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడం కాదని, ప్రజలజీవనో పాధిని దెబ్బతీసే అభివృద్ధిని మాకు అవసరం లేదని, రైతులు ఎనిమిది నెలలుగా పోరాడుతున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం చొచనీయమని అన్నారు. అభివృద్ధి అంటే ఈ ప్రాంతంలో రైతులు పండించిన పంటలకు మద్దతు ధరలు ప్రకటించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు నిర్మించి యువతకు ఉద్యోగాలు కల్పించాలని, రైతుల భూములకు సాగునీరు అందించాలని వారన్నారు. ఈ ప్రాంతంలో ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా చేస్తే చూస్తూ ఊరుకోమని, కర్ణాటక ఏరో స్పేస్ పార్కు రైతులు పోరాట స్ఫూర్తిగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు. ఇ ప్పటికైనా ప్రభుత్వం కార్గో ఎయిర్పోర్ట్ నిర్మాణ ప్రతిపాదనలను వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.



## ఉచిత దంత వైద్య శిబిరం విజయవంతం

**ఇచ్ఛాపురం, జులై 17 (వార్త):** ప్రభుత్వ హై స్కూల్లో విద్యార్థుల ఆరోగ్యం, దంత పరిశుభ్రత కోసం జేసీఐ అధ్వర్యంలో వాసవి డెంటల్ క్లినిక్ కి సంబందించిన డాక్టర్ వెచ్చా వాసవి పర్యవేక్షణ లో ఉచిత దంత వైద్య శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ శిబిరానికి హెడ్ మాస్టర్ కె. సూర్యరావు, స్కూల్ అసిస్టెంట్ ఏ. జయలక్ష్మి మద్దతు ఇచ్చారు. సుమారు 120 మంది విద్యార్థులకు ఉచితంగా దంత పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు దంత సంబంధిత అవగాహన, చికిత్సా సలహాలతో పాటు అవసరమున్నవారికి ఉచిత మందులు ఇచ్చారు. కార్యక్రమంలో తంగుడు శణ్ముఖ్ ,శిరీష, రేణుక, శ్రావ్య, , సంతోష్ సాహు , వెచ్చా రాము పాల్గొన్నారు జేసీఐ అధ్యక్షులు కాళ్ళ జైదేవ్ పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల సమ్మె




**పలాస, జులై 17(వార్త):** గతంలో జరిగిన సమ్మె కాలపు ఒప్పంధాలు అమలు చేయాలని బుధవారం నుండి రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు దిగి రెండవ రోజుకు చేరింది.గతంలో సమస్యలు పరిష్కారం చేయాలని 17 రోజులు సమ్మె చేపట్టామని ఆ సందర్బంగా ప్రభుత్వం పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చి నేటికి రెండు ఏళ్ళు గడచినా ఇప్పటికీ పరిష్కరించలేదని, రెండవ రోజు సమ్మె లో నిరసన ర్యాలీ గురువారం చేపట్టారు. ఈ సందర్బంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి యన్ గణపతి,మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కె వెంకట్, సి హెచ్ మురగన్, యం రవి మాట్లాడుతూ గత సమ్మెలో అంగీకరించిన వాటిలో రిటైర్ అయిన, చనిపోయిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇస్తామని, గ్రాడ్యూటి చెల్లిస్తామని, దహన సంస్కారం ఖర్చులు పెంచుతామని, ఒప్పంధం లో ఉందని అన్నారు. కార్మికులు చనిపోయిన సందర్బంలో ఎక్సగ్రేషయో చెల్లిస్తామని, వేతనాలు పెంచే విషయం పరిశీలనలో ఉందని హామీ ఇచ్చారని తెలిపారు. సుప్రీం కోర్ట్ తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, సమ్మె కాలపు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆప్ కాస్ విధానం రద్దు చేసి కార్మికులు అందరినీ పర్మినెంట్ చేయాలని కోరారు. ఈ సమస్యలుపై రెండు రోజుల రాష్ట్ర వ్యాప్త సమ్మెకు పిలుపు ఇవ్వడం జరిగిందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఈ ర్యాలీలో యస్ శంకర్, ప్రకాష్ ముఖి, యస్ రమేష్,కె ఈశ్వరరావు, బాలకృష్ణ, తిరుపతి, దివాకర్, గులాబీ, పార్వతి, పాపమ్మ తదితరులు తో పాటు మున్సిపల్ శానిటేషన్ కార్మికులు పాల్గొన్నారు.

**ఇచ్ఛాపురం, జులై 17 (వార్త):**మున్సిపల్ కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికులు సమ్మె లో పాల్గొన్నారు. డిమాండ్ల సాధన కు ఔట్ సోర్సింగ్ సిబ్బంది సమ్మె చేస్తున్నారు. ప్రజలు చెత్త సేకరణ కు సహకరించాలని కమిషనర్ ఎన్ రమేశ్ కోరారు.

## ఆగస్టు 3న జిల్లాస్థాయి యోగాసన పోటీలు

**శ్రీకాకుళం, జులై 17(వార్త):** నేషనల్ యోగా స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యోగాసన పోటీలు ఆగస్టు 3న నరసన్నపేటలో నిర్వహించనున్నట్లు ఎన్‌వైఎస్ఎఫ్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. విశాఖ %-%ఏ కాలనీలో ఆయన క్యాంపు కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని, ప్రస్తుత కాలంలో యోగాను జీవితంలో ఒక భాగం చేసుకోవాలని సూచించారు. జిల్లాస్థాయిలో అన్ని కేటగిరీల్లో ఉన్న యోగా సాధకులు ఆరోజు ఉదయం 7 గంటలకు హాజరుకావాలన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి రాష్ట్రస్థాయి యోగాసన పోటీలకు పంపిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కొంక్యాన మురళీధర్, అర్చన, కార్యదర్శి తంగిస్వాతి, కోశాధికారి చౌదరి శ్రీనివాస్, దుంపల చిన్నబాబు, రమ్య, జీవిత, పాండ్రంకి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## మహా బలిపురం కన్వెన్షన్‌కు రండి

**-కలెక్టర్‌ని ఆహ్వానించిన పారిశ్రామికవాడు అసోసియేషన్**



**పలాస, జులై 17 (వార్త):** పలాస జీడిపప్పు కి ప్రతిష్టాత్మక వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ అవార్డు అందుకొన్న జిల్లా కలెక్టర్ స్వప్నీల్ దినేకర్ పుండకర్ కి అల్ ఇండియా క్యాషూ అసోసియేషన్ (ఎఐసిఏ), పారిశ్రామికవాడ అసోసియేషన్ తరుపున అభినందిస్తూ. ఈ నెల 24,2526 వ తేదీలలో మహాబలిపురం లో జరగబోతున్న ఆల్ ఇండియా క్యాషూ కన్వెన్షన్‌కు రమ్మనమని కలెక్టర్‌ను గురువారం ఆహ్వానించారు. ఆహ్వానం అందించిన వారిలో ఏఐసి ఏ బోర్డ్ మెంబెర్ మల్లా కాంతారావు, పారిశ్రామికవాడ అధ్యక్షులు మల్లా రామేశ్వరరావు, కార్య దర్శి తూముల శ్రీనివాసరావు, వినయ్, తాళాసు శ్రీను, సుడియా రత్నాకర్ , కొంచాడ సందీప్ పాల్గొన్నారు.

# ఇంకెన్నాళ్లు ఈ నరకం..!

**-సచివాలయ, అంగన్‌వాడీ కేంద్రాలను ప్రారంభించరా..?**

**-పట్టించుకోని పాలకవర్గం**

**-నరకం చూస్తున్న సచివాలయ సిబ్బంది**

**-కొత్తూరు అంటే నాయకులకు ఎందుకింత చిన్నచూపు**

**కొత్తూరు, జులై 17(వార్త):** పట్టించుకోని పాలకవర్గం, మౌనంగా ఉన్న అధికారులు, నరకాన్ని తలపించే పని వాతావరణం ౹ ఇదే ప్రస్తుతం కొత్తూరు



మేజర్ పంచాయతీ సచివాలయం–2 పరిస్థితి. గ్రామ సచివాలయాలు రాష్ట్రవ్యాప్తంగా కొత్త భవనాలతో నూతన శక్తితో మెరుగైన సేవలు అందిస్తున్నాయి. కానీ కొత్తూరు మండలంలోని సచివాలయం–2 మాత్రం ఇప్పటికీ దారుణమైన పరిస్థితుల్లోనే కొనసాగుతోంది. చెత్తకుప్పల మధ్య, ఆవరణం లేకుండా, మరుగుదొడ్ల కాస్త లోపలే ఉన్న చోటే ఉద్యోగులు విధులు నిర్వ హించడమంటే ఊహించదగిన విషయం కాదు.అదే భవనం పక్కనే ఉన్న అంగన్‌వాడీ కేంద్రం కూడా చిన్న పిల్లలకు ఊపిరి తీయలేని స్థితిలో ఉంది. దుర్వాసనతో కూడిన వాతావరణం చిన్నపిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ పరిస్థితుల్లో ఉద్యోగులు పనికి రావడమే కాకుండా నిజాయితీగా విధులు నిర్వ ర్తించడమంటే అభినందించదగ్గ విషయం. ఇదే భవనానికి మూడు సంవత్సరాల క్రితమే కొత్త భవనం నిర్మాణం పూర్తయ్యింది. అయినా ఇప్పటి వరకు ప్రారంభోత్సవం లేకపోవడం, స్థానిక ప్రజలను ఆవేదనకు గురిచేస్తోంది. కొందరు నాయకులు ఎమ్మెల్యే మామిడి గోవింద రావుతో ఈ విషయమై మాట్లాడగా, “త్వరలో ప్రారంభిస్తాం” అనే మాట వినిపించినా, అది వాస్తవం కాలేదంటే ఈ కొత్తూరు మండలానికి నేతల దృష్టిలో విలువ లేదా? సచివాలయం కొత్త భవనం ప్రారంభానికి ఇంకా ఎంతకాలం పట్టబోతుంది. అని ప్రజలు స్థానిక నాయకులను ప్రశ్నిస్తున్నారు.ఈ ప్రాంతంలోని ప్రజలు ప్రభుత్వంపై, స్థానిక నాయకులపై నమ్మకం కోల్పోతున్నారు. తక్షణమే



చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు నాయకులను వేడుకుంటున్నారు.



# విద్యార్థుల మౌలిక వసతులపై ఆరా

**-బాల సదన్‌ను సందర్శించిన సీనియర్ జడ్జి హరిబాబు**




**పలాస, జులై 17 (వార్త):** కాశీబుగ్గతిలక్ నగర్ లో ఉన్న బాల సదన్ ( చిల్డ్రన్ హోమ్) ను జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె. హరి బాబు సందర్శించి, పరిశీలించారు. అధ్యక్షులు, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ,- జిల్లా ప్రధాన న్యాయమూర్తి వారి ఆదేశాలపై గురువారం బాలసదనమును సందర్శించామని న్యాయమూర్తి తెలుపుతూ బాలసదనలో బాలికలు వసతిని, పరిశీలిస్తూ వారికి ఇచ్చే భోజన, వైద్య ఇతర సౌకర్యాలును విద్యార్థినులని అడిగి తెలుసుకున్నారు. బాల సదన్ యొక్క సిబ్బందికి తో న్యాయమూర్తి మాట్లాడుతూ ఈ బాల సదన్ యొక్క వసతు గృహానికి కావలసిన సౌకర్యాలు, అవసరాలు ఏమైనా ఉన్నాయా అనీ, బాలికలకు, విద్యార్థినులకు అత్యవసరంగా అందించవలసిన సౌకర్యాలు ఉంటే తెలియజేసిన ఎడల వాటిని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వారి ముందు ఉంచి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో బాలసదన్ ఇంచార్జి సూపరింటెండెంట్ లతా, సిబ్బంది పాల్గొన్నారు.

# చంద్రబాబు చెప్పింది.. చేయడు..!

**-మాజీ మంత్రి డాక్టర్ అప్పలరాజు**

**-పోలీసుల పనితీరుపై మండిపాటు**

**-వడ్డీతో సహా తిరిగి రుణం తీర్చుకుంటాం**

**పలాస, జులై 17 (వార్త):** చంద్రబాబు చెప్పింది చేసింది చెప్పడు మహామోసగాడని, పలాస పోలీసుల పనితీరుపై మండిపడిన మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు వడ్డీతో సహా తిరిగి రుణం తీసుకుంటామని శపథం చేశారు.

గురువారం సాయంకాలం జరిగిన పలాస వైసిపి కార్యకర్తల మండల విస్తృతస్థాయి పలాస మండలం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం కాశీబుగ్గ కీర్తన ఫంక్షన్ హాల్ నందు నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి యాడాదిన్నర కాలం గడిచినప్పటికీ ఏ ఒక్క హామీ కూడా పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడుతున్నారని, పైగా తాను ఎన్నికల్లో హామీగా ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలన్నీ అమలు చేసేసామని, అమలు చేసేసామని ఎవరైనా అమలు కాలేదని, ప్రశ్నిస్తే వారి భరతం పడతామని, ఎదురు దాడి చేస్తున్నారని, ఇంతకన్నా దిగజారుడు రాజకీయాలు ఉండవని ఇలాంటి రాజకీయాలు చంద్రబాబునాయుడుకు మాత్రమే సాధ్యమని అన్నారు. ౹

పజలకు ఈ ప్రభుత్వం చేస్తున్న మోసంపై బాబు సూరిటీ మోసం గ్యారెంటీ అనే కార్యక్రమాన్ని విరివిగా ప్రజల్లోకి తీసుకువెళ్లి వారిని చైతన్య పరచాలని ప్రతి గ్రామంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహిస్తామని మాజీ మంత్రి అన్నారు. పలాస మండల అధ్యక్షులు దువ్వాడ రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో హనుమంతు వెంకట్రావు దొర, ఉంగ సాయి కృష్ణ, పైల చిట్టిబాబు, బత్తిన హేమేశ్వరరావు, బమ్మిడి దుర్యోధన, డోక్కరి దానయ్య, కొర్ల మురళీకృష్ణ చౌదరి, గుండు మోహన్, తలగాణ శ్రీరాములు, కొర్ల సంతోష్, బొడ్డు సుధాకర్, సవర మోహన్, మామిడి వీరరాజు, జినగ సీతారాం, వంకలు షణ్ముఖరావు, జామి రామారావు, సవర లక్ష్మణ్, పోతనపల్లి మాధవరావు తదితరులతో పాటు పలాస మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.








## మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికులు కీలకం

**పలాస, జులై 17 (వార్త):** మున్సిపాలిటీలో పారిశుద్ధ్య నిర్వహణలో పారిశుద్ధ్య కార్మికులు కీలకమని పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు స్పష్టం చేశారు. గురువారం పలాస–కాశీబుగ్గ పురపాలక సంఘంలో పారిశుధ్య పనులు పరిసరించారు. పలాస కాశీబుగ్గ పురపాలక సంఘంలో రోజువారి పారిశుధ్య పనులు పరిశీలనలో భాగంగా కాశీబుగ్గ 17వ వార్డు ఎంపీడీఓ ఆఫీస్ రోడ్ లో స్వీపింగ్ ప్రక్రియను కమీషనర్ పరిశీలించారు. కాశీబుగ్గ 13 వ వార్డు, వెజిటబుల్ డైలీ మార్కెట్ 14వ వార్డు, కేటీ రోడ్లో శానిటేషన్ ను పరిశీలించి, కాశీబుగ్గ రైల్వే క్వార్టర్స్ 9వ వార్డ్ వెంకటేశ్వర కాలనీ లో శానిటేషన్ పరిస్థితి గమనించారు. 30వ వార్డు వాసుదేవపేట లో డ్రైనేజ్ ల పరిస్థితిని పరిశీలించి, సిల్ట్ లను బాబ్ కార్ట్ తో తొలగించడం జరిగింది . 1వ వార్డు మొగిలిపాడు జంక్షన్ లో పర్యటించి కాలువలు పై ఉన్న పిచ్చి మొక్కలు ను సిబ్బంది తో తొలగించడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ తెలియ జేశారు. కాశీబుగ్గ ఓల్డ్ బస్టాండ్ రోడ్లో గల అన్న క్యాంటీన్ డైలీ ఇన్స్పెక్షన్స్ లలో భాగంగా ఈరోజు కూడా బ్రేక్ ఫాస్ట్ టైం లో ఇన్స్పెక్ట్ చేయటం జరిగింది. నిర్వహణ సంతృప్తికరముగా ఉన్నదని కమిషనర్ తెలియజేశారు. పురపాలక సంఘ కార్యాలయంలో వార్డు వెల్ఫేర్ సెక్రెటరీలు,ఆర్పీలతో స్ట్రీట్ వెండర్స్ సర్వేపై సమీక్షను నిర్వహించారు. ఈ సమావేశం లో సర్వేను త్వరిత గతిన పూర్తి చేసి, స్ట్రీట్ వెండర్స్ కు ప్రభుత్వం నుండి రావలసిన అన్ని పథకాలు వారికి అందేటట్లు చూడవలసినదిగా కమిషనర్ ఆదేశించారు.

## పోలీసు జాగిలంతో తనిఖీలు



**ఇచ్ఛాపురం, జులై 17 (వార్త):** పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో పోలీస్ జాగిలం కెనైన్‌తో సోదాలు నిర్వహించారు. దుకాణాలు, రైల్వే స్టేషన్, వాణిజ్య సముదాయాల్లో టౌన్ ఎస్ ఎమ్.ముకుందరావు తనిఖీలు చేపట్టారు. గంజాయి డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాలు అక్రమ రవాణా అమ్మకాలపై తనిఖీ చేశారు.

## సిక్కోలును అభివృద్ధి చేసి చూపిస్తా

**శ్రీకాకుళం, జులై 17(వార్త):** ఎన్నడూలేని శ్రీకాకుళం అభివృద్ధిని రానున్న రోజులలో చూస్తారని, నగరాలకు దీటుగా గ్రామాలను కూడా అభివృద్ధి చేస్తామని, శ్రీకాకుళం నియోజకవర్గ శాసనసభ్యులు గొండు. శంకర్ గురువారం అన్నారు. సుపరిపాలన తొలిఅడుగులో భాగముగా గార మండలం, వత్సవలస పంచాయతీ, శ్రీరామవానిపేట, కుట్టువానిపేట, పేర్లవానిపేట, మొగడాలపాడు గ్రామాలలో ఇంటింటికీ వెళ్లి, ఇప్పటివరకు కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరిస్తూ, గ్రామాలలో చేయవలసిన పనులను పరిశీలించారు. అనంతరం గ్రామాలలో ఉండే సమస్యలను, ప్రజా సమస్యలను అడిగి, ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు అందరికీ అందుతున్నాయో, లేదో తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని, ఎటువంటి సమస్యనైనా, ఎప్పుడైనా, ఎక్కడైనా నాకు తెలియజేస్తే, సమస్య పరిస్కారమయ్యేవిధంగా చూస్తానన్నారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే, మన ఆరోగ్యాలు బాగుంటాయని, ఇంట్లో వ్యర్థాలను బయటగాని, కాలువాలలోగాని వెయ్యకుండా, గ్రామ పరిధిలో, పంచాయతీ సిబ్బంది అమర్చిన చెత్తబుట్టలో వెయ్యాలని, అప్పుడే సుందరగ్రామంగా చూడవచ్చున్నారు. కేంద్రంలో బీజేపీ సహకారంతో, రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా.చంద్రబాబు నాయుడు మంచి ఆలోచనలతో, ఉపముఖ్యమంత్రి కొణిదెల. పవన్ కళ్యాణ్, బావితర నేత నారా.లోకేష్ బాబుల చొరవతో కూటమిప్రభుత్వం అభివృద్ధిపదంలో నడుస్తుందని, ప్రజలు నమ్మకంతో మమ్మల్ని గెలిపించారని, ప్రజాసేవతో ఆ ఋణం తీర్చుకుంటామన్నారు. ఏడాదిపాలనలో ఎంత అభివృద్ధి చేసామో ప్రజలందరికీ తెలుసని, రానున్న కాలంలో కూటమిప్రభుత్వం అభివృద్ధివైపు పరుగులు తీస్తూ, సవ్యఆంధ్రదిశగా ముందుకువెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణ, టీడీపీ గార మండల అధ్యక్ష బృందం, మండల టీడీపీ నాయకులు, గ్రామ, పంచాయతీ అధికారులు, టీడీపీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts coleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546